క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక


గణేష్

చిప్పగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం.గణేష్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లతీఫ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తుందని చెప్పారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న సర్పంచ్ విరుపాక్షిరెడ్డి

నందవరం: జగనన్న కాలనీల్లో నిరుపేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పించే దిశగా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని ముగతి గ్రామంలో 200 మందికి ఇంటి స్థలాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు మంజూరు చేయడం జరిగింది. బుధవారం గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి చేతుల మీదుగా పేదలకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన


కొత్తపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అలివేలమ్మ

మద్దికెర: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు పోలింగ్ బూత్‌లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని హంప మజారా గ్రామమైన కొత్తపల్లి గ్రామంలో 40వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్రాలలో ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఓ స్వర్ణలత వెంట ఉన్నారు.

తిమ్మప్పస్వామి ఉత్సవాలు ప్రారంభం


పూజలందుకుంటున్న స్వామివారు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప, దడేదూలప్ప, ఎడవళప్ప స్వామి వార్ల రథోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామివారికి గంగపూజ చేసేందుకు భక్తులు గ్రామ పురవీధుల గుండా డప్పువాయిద్యాలతో జలాన్ని తీసుకొచ్చారు. గంగ పూజ అనంతరం తిమ్మప్ప స్వామి వారి మూలవిరాట్, యడివళ్లప్ప తిమ్మప్ప, దడేదూళప్ప స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు


సుందరంగా ముస్తాబైన మస్తాన్‌వలి దర్గా

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో వెలిసిన హజరత్ మస్తాన్‌వలి ఉరుసు బుధవారం రాత్రి గంధం వేడుకలతో ప్రారంభమైంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు దర్గా నిర్వాహకులు మంచినీరు, అన్నదానం, వసతి తదితర సౌకర్యాలు కల్పించారు. గత 40 సంవత్సరాలుగా కొత్తపేట మస్తాన్‌వలి ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న గాయత్రీ మాత

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆరాధనోత్సవాల సందర్భంగా రెండవ రోజు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, గణపతి హోమం, చండీ పారాయణం, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేసిన మేలును మరువొద్దు

- మహిళల ఆర్థిక వికాసానికి సంక్షేమ పథకాలు
- చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దు
- ఆసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


వైఎస్సార్ ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,


కార్యక్రమానికి హాజరైన మహిళలు

కృష్ణగిరి: మహిళలకు మేలు చేసిన పార్టీకే మద్దతు ఇవ్వాలని, ప్రతిపక్షనేత చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి మళ్లీ మోసపోవద్దని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. కృష్ణగిరిలో బుధవారం ఆమె వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత మెగా చెక్కును ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణితో కలిసి పొదుపు మహిళలకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటిల్లిపాదికి ఆర్థిక భరోసా అందించి మహిళలను అందలం ఎక్కించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగనన్న అడపడుచులకు అండగా నిలుస్తున్నాడని కొనియాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న జగనన్నకు అందరూ రుణపడి ఉండాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడల్లో రూ.80 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. కృష్ణగిరి మండలంలో 416 సంఘాల్లోని 4,088 మంది మహిళలకు వరుసగా నాలుగోసారి రూ.1,87,00,000 నగదు జమ చేసినట్లు తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నదే జగనన్న ఆశయమన్నారు. గత టీడీపీ హయాంలో బడ్జెట్ అంతా ఆ పార్టీ నేతల జేబుల్లోకి, జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్లకు చేరేదని ఆరోపించారు.

మీరే మా బలం..

గత ఎన్నికల్లో రాజన్న రాజ్యం స్థాపనకు అన్ని వర్గాల ప్రజలతోపాటు ప్రధానంగా మహిళలు తమకు అండగా నిలిచారన్నారు. మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు మహిళలే తమ బలమని, మహిళలంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు.

సార్వత్రిక ఎన్నికలకు 'సిద్ధం'

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం పేరుతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి శంఖారావం పూరించారని, సిద్ధం సభలకు వచ్చిన స్పందన చూసి ప్రతిపక్షాల గుండెల్లో గుబులు పుట్టిందన్నారు. రాప్తాడులో జరిగిన సిద్ధం సభ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధానికి మారంతా సిద్ధమా అంటూ మహిళలతో గొంతు కలిపారు. మేం సిద్ధం అంటూ మహిళలు నినదించారు. అనంతరం నూతనంగా మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. సీఎం జగనన్న చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, వైస్ ఎంపీపీ సుశీల, మండల కో–ఆప్షన్ మెంబర్ నక్కషాలు, ఎంపీటీసీ మహాలక్ష్మి, నాయకులు మాధవరావు, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

మండల పరిధిలోని అమకతాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వై.మహేష్, విజేయుడు, ప్రసాద్, లక్ష్మినారాయణతోపాటు మరికొంత మంది ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ మాధుసూదన్‌నాయుడు, కృష్ణారెడ్డి, బాలమి న్నెల్ల, గోవిందురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

మద్దికెర: మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కిరణ్మయి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ అంకమరావు తెలిపారు. బుధవారం మద్దికెరలోని శ్రీవిద్యాసాయి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం 147 మంది, ద్వితీయ సంవత్సరం 144 మంది, సప్లిమెంటరీ 118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ సునీత ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో వెబినార్

పత్తికొండ రూరల్: జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా బుధవారం పత్తికొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ వెబినార్ నిర్వహించారు. అంగారక గ్రహంపై వాతావరణ పరిశోధనలు అనే ఇతివృత్తంపై అమెరికాకు చెందిన అరిజోనా, స్టేట్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ కె.సాయిక్రిష్ణతేజ ప్రసంగాలను వినిపించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి తెలిపారు. అధ్యాపకులు శశిధర్, రామకృష్ణ, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యకేసులో 12 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కె.మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో బోయ రవి హత్య కేసులో 12 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ కె.మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. గ్రామంలో కొన్ని రోజుల క్రితం రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో బోయ రవి మృతి చెందినట్లు చెప్పారు. ఈ హత్యకేసులో 12 మంది నిందితులను గుర్తించి వారు బోయ నరసయ్య పొలంలోని నీళ్ల ట్యాంక్ వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో బోయ గోవిందు, లోకేష్, వెంకటేష్, శ్రీను, నరసయ్య, పరమేష్, మారెన్న, ఈరన్న, గొర్ల కేశన్న, మహేష్, కేశన్న (గువ్వోడు), మారెన్న (చిన్నమారెన్న)లను అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోందని సీఐ చెప్పారు.

అడిగిన వారందరికీ ఉపాధి


అల్లుగుండు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): వేసవి నేపథ్యంలో మండలంలో వ్యవసాయ, ఇతరత్రా పనులు తక్కువగా ఉంటాయని, పనులు కావాలని అడిగిన వారందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అదనపు పనిదినాలు కల్పించిందని, ఉపాధి సిబ్బంది సైతం ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని అల్లుగుండు గ్రామ సమీపంలో జరుగుతున్న చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ.. మంచి వేతనాలందేలా బాగా పనిచేయాలని సూచించారు. కూలీల హాజరును ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎంసీసీ భవనంలో మండల అధికార, సిబ్బందితో సమావేశమయ్యారు. రికార్డులు, వర్క్ ఫైల్స్ పరిశీలించారు. ఫారం పాండ్లు, పండ్లతోటల పెంపకానికి సంబంధించిన పనులపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీఓ శివశంకరప్ప, ఏపీఓ రాజునాయక్, ఈసీ, టీఏలు, ఎఫ్ఏలు, ఆఫీసు సిబ్బంది ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారం


పగిడిరాయిలో ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న జగన్నాథ రెడ్డి

తుగ్గలి: పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథరెడ్డి అన్నారు. పగిడిరాయి జగనన్న కాలనీలో ఇంటి స్థలం పొంది ఇళ్లు నిర్మించుకుంటున్న 60 మంది లబ్ధిదారులకు బుధవారం వీఆర్వో రంగన్నతో కలిసి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. గతంలో ఎవరూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇళ్లు లేని నిరుపేదల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసి పక్కా ఇళ్లు కట్టిస్తున్నారన్నారు. ఉచితంగా ఇంటి స్థలంతో పాటు, ఇళ్లు కట్టుకునేందుకు అవసరమైన నగదు, సామగ్రి అందిస్తున్నారని చెప్పారు. లక్షలాది రూపాయలు విలువ చేసే ఆస్తి అక్కచెల్లెమ్మలకు అందించారన్నారు. మేలు జరిగిన వారంతా అండగా నిలిచి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

చిన్నారుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ

ఆలూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులలో రక్తహీనత, బరువు తగ్గడం వంటి లోపాలు తలెత్తితే అందుకు అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆలూరు ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ హెచ్చరించారు. ఆమె బుధవారం హాలహర్వి మండలం గూళ్యం, బాపురం, హాలహర్వి అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పౌష్టికాహారం పంపిణీ తదితర వాటిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు తమ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో రెండు, మూడుసార్లు చిన్నారుల ఎత్తు బరువు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పాలు, గుడ్లు, పౌష్టికాహారం పంపిణీపై నివేదిక అందజేయాలన్నారు.

సంక్షిప్తం

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

హాలహర్వి: మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఆంతోనీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు ఈరన్న, శ్రీనివాసులు, నిరంజన్‌లతో సమావేశమయ్యారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదలైన నీటిని పంపింగ్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలకు సక్రమంగా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సచివాలయ భవనాలను పూర్తి చేయండి

ఆలూరు: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనులను వేగంగా పూర్తి చేయాలని పీఆర్ డీఈ శ్రీరాములు సూచించారు. ఆయన బుధవారం హాలహర్వి, ఆలూరు మండలాల్లోని మనేకుర్తి, ఆలూరు గ్రామాల్లో పూర్తి చేసిన చేసిన సచివాలయ భవనాలను పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో మాట్లాడుతూ.. దేవనకొండ మండలంలో – 3, ఆస్పరి – 2, ఆలూరు – 2 , హొళగుంద – 5 గ్రామ సచివాలయ భవనాలను త్వరలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. అన్ని మండలాల ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఈ సూచించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయండి

హొళగుంద: స్థానిక కోటవీధి 1వ వార్డులో గత మూడు నెలలుగా మంచినీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా కావడంతో పాటు నీరు కలుషితమవుతున్నాయని స్థానికులు బసవ, సిద్ధప్ప, మల్లయ్య తదితరులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడ్తున్నామని చెప్పారు. లీకేజీ కారణంగా కాలనీలో మంచి ఎద్దడి నెలకొందని, నీరు కలుషితమై పైపులోకి చేరుతున్నాయని వాపోయారు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్త జనార్ధననాయుడుపై జెడ్పీటీసీ రామకృష్ణ సోదరుడు వడ్డె శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి గాయపరిచాడు. జనార్ధన్‌నాయుడు బజారుగుండా వెళ్తుండగా దాడి జరిగింది. వడ్డె శ్రీనివాసులు మంత్రి గుమ్మనూరు జయరాం వర్గీయుడు కాగా, జనార్ధన్‌నాయుడు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విరూపాక్షి వర్గంలో ఉన్నారు. పార్టీ ఆలూరు ఇన్‌చార్జిగా విరూపాక్షిని నియమించడంపై ఇటీవల జెడ్పీటీసీ రామకృష్ణ పార్టీకి రాజీనామా చేశారు. ఈ క్రమంలో వడ్డె శ్రీనివాసులు ఉద్దేశపూర్వకంగా జనార్ధన్‌నాయుడును విరూపాక్షి వర్గం వెంట తిరగవద్దని నానా దుర్భాషలాడుతూ దాడి చేశాడని బాధితుడు వాపోయారు. గాయపడిన జనార్ధన్‌నాయుడు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఘటనపై బుధవారం దేవనకొండ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

- సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా జగనన్న పాలన
- అర్హులకు ఇంటి వద్దకే పథకాలు
- కులుమాలలో సచివాలయం, హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం, వెలుగులు నిండాయని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. మండలంలోని కులుమాల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.22 లక్షలతో నిర్మించిన హెల్త్‌క్లినిక్ భవనాలను బుధవారం ఎంపీడీఓ సోనీబాయితో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండేది కాదన్నారు. జగనన్న పాలనలో సచివాలయంలో దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే పథకాల ఫలాలు ఇంటి ముంగిటకే ఇస్తున్నామన్నారు. అలాగే అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందని కొనియాడారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. గత టీడీపీ హయంలో పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు ఉండాలని, చంద్రబాబు హయాంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప ఎక్కడా అభివృద్ధి చేసిన దఖాలాలు లేవన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అలాగే గోనెగండ్ల మండలంలో తాగునీటి పథకాలకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని, ఆ నిధులతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 14 గ్రామాలకు తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. టెండర్లు కూడా పూర్తయ్యాయని త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, బందెనవాజ్, మన్సూర్, భాస్కర్ రెడ్డి, రత్నం, అమరేశప్ప, దస్తగిరి, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈలు శివశంకర్, శ్రీనివాసరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గూళ్యంలో గడ్డివాముల దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తినష్టం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో రైతులు సంగాల గాదిలింగప్ప, బళ్లారి రాజశేఖర్, పెద్ద బజ్జప్పకు చెందిన గడ్డివాములకు బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే ఆలూరు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా, వారు వచ్చేలోపు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. రూ.2 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం బాధిత రైతులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వీఆర్వో ఈరన్న, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయానికి పంపుతామని చెప్పారు.

ఎండతీవ్రతపై కూలీలు జాగ్రత్త

హాలహర్వి: ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఉపాధి కూలీలు ఉదయం 11 గంటల్లోపే పనులు ముగించుకోవాలని ఏపీఓ హేమసుందర్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని హాలహర్వి, బాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఉదయం 7 గంటలకల్లా పనుల్లోకి వచ్చి 11 గంటలకల్లా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

బోర్లకు మరమ్మతులు చేయించండి

ఎమ్మిగనూరుటౌన్: వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించాలని సీపీఐ నాయకులు పంపణ్ణగౌడ్, భాస్కర్‌యాదవ్, రంగన్న కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వారు వినతిపత్రం అందించారు. పట్టణంతో పాటు శివారు కాలనీల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లకు మరమ్మతులు చేసి వాటి ద్వారా ట్యాంక్‌లకు నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

1న వృషభాల బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవం పురస్కరించుకొని మార్చి 1వ తేదీ ఉదయం 8 గంటలకు న్యూ కేటగిరీ రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేతగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, 16 తులాల వెండి, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు బహుమతిగా అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు 1వ తేదీ ఉదయం 8:45 గంటల్లోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 99496 17011, 82478 86829 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

శ్రీశైలానికి బయలుదేరినశివస్వాములు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ, ఎరుకలచెర్వు గ్రామాలకు చెందిన శివస్వాములు బుధవారం కాలినడకన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. ఆయా గ్రామాల్లోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం శివాలయంలో గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ధరించారు. శివస్వాములను గ్రామస్తులు మేళతాళాలతో ఊరేగించి వీడ్కోలు పలికారు. గత కొన్నేళ్లుగా శ్రీశైలానికి కాలినడకన వెళ్లుతున్నట్లు వారు తెలిపారు.

వలంటీర్ల సేవలు అమోఘం


కనకవీడులో వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందిస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వలంటీర్లను సేవా మిత్ర అవార్డులను అందజేసి శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసి వలంటీర్లు ప్రజల మన్ననలను పొందారన్నారు. జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉంటే చాలు వారి తలుపు తట్టి సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, పంచాయతీ కార్యదర్శి రామారావు, వీఆర్వో రవి, వెల్ఫేర్ అసిస్టెంట్ అఖిల్ తేజ్, ఎంపీటీసీలు శివన్న, తిక్కన్న, డీలర్ తిమ్మప్ప, పసల వెంకటరాముడు, చిన్నయ్యలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు


కప్పట్రాళ్ల గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

దేవనకొండ: ఎన్నికలు దగ్గర పడుతున్న దృష్ట్యా గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం రాత్రి మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగాకుండా వారే పంచాయితీలు చేసుకుని అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. దేవనకొండ సీఐ శ్రీనివాసులు, పోలీసులు ఉన్నారు.

ఉపాధి పనుల కల్పనపై నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ

దేవనకొండ: జిల్లాలో ఐదు లక్షలకు పైగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు వలసలు వెళ్లినా ప్రభుత్వం, అధికారులు ఉపాధి పనులు కల్పించి వలసలను ఆపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ విమర్శించారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక సీఎల్ఆర్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసలను పూర్తిస్థాయిలో నివారించేందుకు ప్రభుత్వం ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. గిట్టుబాటు వేతనం అందించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. నాయకులు వీరశేఖర్, లింగన్న, తిక్కన్న, వెంకటరాముడు, శ్రీరాములు, బాలకృష్ణ, బాషా, గోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.